నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జీగోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ కుమ్మరిబస్తీ, ఫిలింనగర్ ఫీడర్ల పరిధిలోని కుమ్మరిబస్తీ, వినాయక్‌రావు నగర్, విఠల్‌రావు నగర్, పోలీస్ క్వార్టర్స్, జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్లు 45, 52, 53 ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ సిలికాన్ వ్యాలీ, పీఈబ యూజీ ఫీడర్ల పరిధిలోని ఇమేజ్ గార్డెన్, సిలికాన్ వ్యాలీ, సైబర్ హిల్స్ కాలనీ, జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్లు 36, 62, 63, 64, 65 ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

మరమ్మతుల కారణంగా గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11కేవీ అమీర్‌పేట, బంజారానగర్ ఫీడర్ల పరిధిలోని అమీర్‌పేట ఆర్ ఎస్ బ్రదర్స్, కాకతీయ మెస్, అమీర్‌పేట ప్రధాన రహదారి, దుర్గానగర్ ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు 11కేవీ ఆనంద్‌బాగ్, రామారావు నగర్ ఫీడర్ల పరిధిలోని సోనాబాయి టెంపుల్, సత్యం థియేటర్, స్పెన్సర్స్ బిల్డింగ్, శీష్‌మహల్ థియేటర్, రామారావు నగర్, స్నేహపురి కాలనీ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.


ఆలయ కమిటీ సభ్యులతో చైర్మన్ కూన శ్రవణ్‌కుమార్‌గౌడ్

సాయిగణపతి ఆలయ చైర్మన్‌గా కూన శ్రవణ్‌కుమార్‌గౌడ్

బేగంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బేగంపేట రైల్వేస్టేషన్ సమీపంలోని ఫ్లైఓవర్ కింద ఉన్న సాయిగణపతి ఆలయ నూతన చైర్మన్‌గా కూన శ్రవణ్‌కుమార్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఇటీవల ఆలయ చైర్మన్ కూన వెంకటేష్‌గౌడ్ అనారోగ్యంతో మృతిచెందడంతో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజిబాబు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నరహరిగౌడ్, కోశాధికారి నాయుడు సోమవారం సమావేశమై వెంకటేష్‌గౌడ్ పెద్ద కుమారుడు కూన శ్రవణ్‌కుమార్‌గౌడ్‌ను నూతన చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఆలయ అభివృద్ధి సలహాదారుడిగా రెండవ కుమారుడు గౌరీశంకర్‌గౌడ్‌ను నియమించినట్లు అధ్యక్షుడు అంజిబాబు ముదిరాజ్ తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ ప్రతినిధులు శంకర్ యాదవ్, విజయకుమార్ ముదిరాజ్, దశరథ్, రామచందర్, చంద్రకళ పాల్గొన్నారు.


స్తంభాన్ని పరిశీలిస్తున్న అధికారులు

స్తంభం తొలగింపునకు చర్యలు

బోరబండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సైట్-3 నాట్కో పాఠశాల గేట్ ముందు అడ్డుగా ఉన్న కరెంట్ స్తంభాన్ని తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నామని, అనుమతులు రాగానే తొలగిస్తామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. స్తంభాన్ని తొలగించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీత జిల్లా కలెక్టర్‌కి వినతిపత్ర ఇచ్చారు. ఈ మేరకు సోమవారం విద్యుత్ శాఖ అధికారులు స్తంభాన్ని పరిశీలించారు.


డాక్టరేట్ అందుకున్న మల్లేష్ తదితరులు

గంటా మల్లేష్‌కు గౌరవ డాక్టరేట్

ఎర్రగడ్డ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డకు చెందిన సంఘ సేవకులు, దళిత రత్న గంటా మల్లేష్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. సోమవారం గాడ్సన్ హోలీ స్పిరిట్ మినిస్ట్రీస్, డే స్ప్రింగ్ థియలాజికల్ యూనివర్సిటీస్ టెక్సాస్ ఆధ్వర్యంలో గన్‌ఫౌండ్రిలోని సూర్యలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో మల్లేష్ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు గౌరవ డాక్టరేట్లు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎక్సలెన్స్ అవార్డులను సంస్థ చైర్మన్ ఎంపీ ప్రసాద్, సినీ నటులు బాబుమోహన్, దొరస్వామి తదితరులు అవార్డులను అందజేశారు.

రోడ్డుపై ఆయిల్



ఖైరతాబాద్ ప్రధాన రహదారిపై సోమవారం సాయంత్రం ఆయిల్ పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవడంతో ఎలాంటి ప్రమాదాలు జరగలేదు.

- ఖైరతాబాద్, ఆంధ్రజ్యోతి

సర్వేకు సర్వం సిద్ధం

- సిబ్బందికి ముగిసిన శిక్షణ
- రేపటి నుంచి ఇంటింటికీ వెళ్లనున్న ఎన్యూమరేటర్లు


సర్వే కోసం సిబ్బందికి శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఖైరతాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. సర్వేలో పాల్గొనే ఎన్యూమరేటర్లకు, సూపర్‌వైజర్లకు సోమవారంతో శిక్షణ ముగిసింది. బుధవారం నుంచి ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. మొదటి మూడు రోజుల పాటు ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు అంటించనుండగా 9వ తేదీ నుంచి వివరాలు సేకరించనున్నారు. సర్వే ఎన్యూమరేటర్లుగా ప్రాథమిక పాఠశాలల టీచర్లు, రిసోర్స్ పర్సన్లు, సీఆర్‌పీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు వ్యవహరిస్తున్నారు. ఖైరతాబాద్ సర్కిల్‌లో 442 మంది, జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలో 422 మంది ఎన్యూమరేటర్లను నియమించారు. వారు చేసే పనుల పర్యవేక్షణ కోసం బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, డిప్యూటీ ఈఈ, ఏఈలను నియమించారు. పర్యవేక్షణ కోసం సర్కిల్ 17లో 33 మంది, సర్కిల్ 18లో 35 మందిని నియమించారు.

21 రోజులపాటు సర్వే..

ప్రతి ఇంటికి వెళ్లి సర్వే కోసం ప్రభుత్వం సూచించిన 56 ప్రశ్నలతో పాటు అందులోని 19 ఉప ప్రశ్నలను అడిగి ఇంటి యజమాని సంతకం తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతి సర్వే పత్రంపై ఎన్యూమరేటర్‌తో పాటు సూపర్‌వైజర్ సంతకం తప్పనిసరిగా ఉండాలి. ఎన్యూమరేటర్లు ప్రతిరోజూ 10 నుంచి 15 ఇళ్లలో సర్వే పూర్తి చేస్తారు. ఈ మేరకు 21 రోజుల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

ఇచ్చిన సమాచారాన్ని మాత్రమే తీసుకోవాలి..

ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చి అడిగినప్పుడు ఇంటి యజమానులు, కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారాన్ని మాత్రమే తీసుకుంటారు. బలవంతంగా ఎలాంటి సమాచారాన్ని సేకరించొద్దని అధికారులు సూచించారు. ఈ సర్వేలో ఆధార్ కార్డు నంబర్లతో పాటు ధరణి పాస్ బుక్ నంబర్, రేషన్‌కార్డు నంబర్ అడిగి తీసుకుంటారు. అయితే ఈ సమాచారం కోసం కుటుంబ సభ్యులపై ఒత్తిడి తీసుకురాకూడదు.

ప్రజలు సహకరించాలి



ప్రభుత్వం చేయాల్సిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఈ సర్వేపై ఆధారపడనున్నాయి. కులగణనతో పాటు ప్రజల ఆర్థిక స్థితిగతులను తెలుసుకొని వాటి ఆధారంగా పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ సర్వేకు ప్రజలందరూ సహకరించాలి. ఒకరి వివరాలు మరొకరికి ఏమాత్రం తెలియవు.

- రజనీకాంత్‌రెడ్డి, సర్కిల్-17 ఉప కమిషనర్

మూసీ బాధితులకు అండగా ఉంటాం

- అఖిలపక్ష సమావేశంలో నేతల భరోసా


అభివాదం చేస్తున్న వివిధ పార్టీలు, సంఘాల నాయకులు

పంజాగుట్ట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మూసీ నది సుందరీకరణ పేరుతో ప్రజలను రోడ్డున పడేస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని అఖిలపక్ష పార్టీలు, సామాజిక కార్యకర్తలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) రాష్ట్ర కమిటీ సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మూసీ బాధితుల సమస్యల శాశ్వత పరిష్కారానికి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. మూడు వందల ఇళ్లను కూల్చడంతో పాటు వేలాది ఇళ్లకు గుర్తులు వేస్తున్నారని మండిపడ్డారు. బాధితులకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని, అయితే ప్రభుత్వం అందరితో చర్చించి దీనిపై ముందుకెళ్లాలన్నారు. బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. మూసీ ప్రాజెక్టు పేరుతో పేదల ఇళ్లు కూల్చుతామంటే ఊరుకునేది లేదన్నారు. ప్రభుత్వం వారికి శాశ్వత పునరావాసం కల్పించి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, రాగిడి లక్ష్మారెడ్డి, కె.గోవర్ధన్, జనసేన మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కావ్య, ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు కృష్ణయాదవ్, టీటీడీపీ నాయకుడు సయ్యద్ మతీన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సైబర్ సెక్యూరిటీపై శిఖరాగ్ర సమావేశం

- పోస్టర్‌ను ఆవిష్కరించిన సీపీ సీవీ ఆనంద్


సమావేశం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వార్షిక సైబర్ సెక్యూరిటీ నాలెడ్జ్(హెచ్‌ఏసీకే) శిఖరాగ్ర సమావేశం-2024ను నవంబర్ 6న సోమాజిగూడ ది పార్క్ హోటల్‌లో నిర్వహిస్తున్నట్లు సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఆ సమావేశంలో పరిశ్రమల నిపుణులు, ప్రభుత్వ అధికారులు, మేధావులు, నాయకులను ఒక చోట చేర్చి సైబర్ భద్రత రంగంలో నైపుణ్యం అంతరాన్ని తగ్గించడానికి వ్యూహాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం సీపీ కార్యాలయంలో సైబర్ సెక్యూరిటీ సమ్మిట్-2024 సమావేశ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ ఆనంద్ మాట్లాడుతూ.. సైబర్ భద్రత పట్ల తమ నిబద్ధత పోలీసింగ్‌కు మించిందన్నారు. హెచ్‌సీఎస్‌సీ జనరల్ సెక్రటరీ సి.శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. సైబర్ సెక్యూరిటీ సమ్మిట్ విజ్ఞానాన్ని పంచుకోవడానికి, సైబర్ బెదిరింపులను ఎదుర్కోవడానికి సమర్థవంతమైన వ్యూహాలతో పాల్గొనేవారిని సన్నద్ధం చేయడానికి కీలక వేదికగా పనిచేస్తుందన్నారు. శిఖరాగ్ర సమావేశానికి ముఖ్య అతిథిగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

సౌకర్యాల్లో మేటి.. నాట్కో పాఠశాల

బోరబండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సైట్-3 నాట్కో పాఠశాల గత కొన్నేళ్లుగా కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా నిలుస్తోంది. ప్రతి సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటుతోంది. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గీత ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ఇంటర్వ్యూ



ప్రస్తుతం పాఠశాలలో ఎంత మంది విద్యార్థులున్నారు?

నాట్కో పాఠశాలలో ప్రస్తుతం 1800 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతి ఏటా జూన్‌లో అడ్మిషన్‌ల కోసం వచ్చే వారందరికీ సీటు ఇవ్వలేకపోతున్నాం. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో నో అడ్మిషన్ బోర్డులు పెట్టాల్సిన పరిస్థితి ఉంది.

పది ఫలితాలు ఎలా ఉంటున్నాయి?

వార్షిక పరీక్షలకు ముందు ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులను దత్తత తీసుకుంటారు. సెక్షన్‌ల వారీగా విభజించి వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. 2023-2024 విద్యా సంవత్సరంలో బాలురు-118 మందికి 94మంది.. బాలికలు-153 మందికి 134 మంది ఉత్తీర్ణత సాధించారు. 2022-2023 విద్యా సంవత్సరంలో బాలురు-108 మందికి గాను 93 మంది, బాలికలు-122 మందికి గాను 112 మంది పాసయ్యారు.

సరిపడా తరగతి గదులున్నాయా?

విద్యార్థుల సంఖ్యకు సరిపడా తరగతి గదులున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో అదనపు గదులు నిర్మించుకోవడానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీంతో మరిన్ని తరగతి గదులు అందుబాటులోకి వస్తాయి. నాట్కో స్కూల్‌లో విద్యార్థులకు మంచి సౌకర్యాలున్నాయి. ఇక్కడ చదివిన ఎందరో ప్రస్తుతం ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులుగా ఉన్నారు.

విద్యార్థులకు మీరిచ్చే సూచనలు?

విద్యార్థులు చదువుపట్ల ఇష్టాన్ని కలిగి ఉండటంతో పాటు కష్టపడి చదవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలను కల్పించడంతో పాటు ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు ఇస్తున్నారు. ప్రతిభ గల ఉపాధ్యాయులచే డిజిటల్ బోధన ఉంటుంది. తల్లిదండ్రులు ఫీజుల కోసం రూ.లక్షల మేర వృధా చేసుకోకుండా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి.



నిరసన కార్యక్రమంలో ఎస్‌యూసీఐ ప్రతినిధులు

ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా నిరసన

ఖైరతాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనా, లెబనాన్‌లపై ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా(కమ్యూనిస్ట్) పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. నవంబరు 4ను యుద్ధ వ్యతిరేక దినంగా పేర్కొంటూ ఖైరతాబాద్‌లో పార్టీ ప్రతినిధులు నిరసన చేపట్టారు. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ శాంతియుత వాతావరణం కల్పించాలని కోరారు.

వాటర్‌వర్క్స్ యూనియన్‌తో 'పల్లా'కు సంబంధం లేదు

- యూనియన్ అధ్యక్షుడు రాజిరెడ్డి

హైదరాబాద్ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వాటర్‌వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్‌తో గౌరవ అధ్యక్షుడిగా కొనసాగిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత రాంబాబు యాదవ్‌లకు సంబంధం లేదని యూనియన్ అధ్యక్షుడు రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు మహ్మద్ జహంగీర్ ప్రకటించారు. సోమవారం ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో అధ్యక్ష పదవి నుంచి రాజేశ్వర్‌రెడ్డిని తొలగించామన్నారు. గతంలో ఎన్నికల్లో గెలుపొందిన నేతలు కార్మికుల, ఉద్యోగుల సమస్యలను యాజమాన్యంతో చర్చించి పరిష్కరించడంలో విఫలమయ్యారని, దీంతో యూనియన్ సభ్యుల ఆమోదం మేరకు వారిని తొలగించామని తెలిపారు. వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యవర్గ అధ్యక్షుడిగా రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో కె.రామచంద్ర, సాయికిరణ్ గౌడ్, హషీం, అజయ్‌నాథ్, పండు, నరసింహారెడ్డి, మొగులయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సన్మానం



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును జూబ్లీహిల్స్ బీజేపీ నాయకులు బరిగెల జ్ఞానేశ్వర్, పులిరామ్, డీసీపీ సత్యనారాయణ, కొండ శ్రీనివాస్ సోమవారం కలిసి సన్మానించారు.

-యూసుఫ్‌గూడ, ఆంధ్రజ్యోతి

ఆలయంలో పూజలు



కార్తీక సోమవారం సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పూజలు నిర్వహించి అన్నదానం చేశారు.

- బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

రోడ్డు పనుల పరిశీలన



రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని కార్మికనగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, ఏఈ భరత్ సోమవారం పరిశీలించారు.

- యూసుఫ్‌గూడ, ఆంధ్రజ్యోతి

విద్యార్థులకు బహుమతులు అందజేత


సర్టిఫికెట్లు, బహుమతులతో విద్యార్థులు

ఖైరతాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాల్లో భాగంగా మింట్ కాంపౌండ్‌లోని ప్రభుత్వ సెక్యూరిటీ ప్రింటింగ్‌ప్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించగా విజేతతకు సోమవారం సర్టిఫికెట్లతో పాటు నగదు బహుమతులను అందజేశారు. ఇందులో సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ జనరల్ మేనేజర్ వాజ్‌పే, జేజీఎం(హెచ్‌ఆర్) దుర్గాప్రసాద్, విజిలెన్స్ అధికారి అంజనప్ప, సాయినాథ్, పాఠశాల ప్రిన్సిపాల్ సామ్యూయేల్ రాజ్, ఇన్‌చార్జి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దమస్కస్ చర్చిలో సిల్వర్ జూబ్లీ వేడుకలు


చర్చి ప్రతినిధులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న చైర్మన్ పాల్ కరుణాకర్ దంపతులు

ఖైరతాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ మారుతీనగర్‌లోని దమస్కస్ చర్చి స్థాపించి 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. పది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా చర్చ్ ఆఫ్ సౌతిండియా, రాంకోట్ పాస్టర్ డాక్టర్ టి.భాస్కర్ ముఖ్య అతిథిగా పాల్గొని శాంతిసందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా చర్చి చైర్మన్ దంపతులు పాల్ కరుణాకర్, సరోజిని చర్చి ప్రతినిధులకు నూతన వస్త్రాలు బహూకరించారు. ఈనెల 10న సిల్వర్ జూబ్లీ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. రెవరెండ్ ప్రతాప్, పాస్టర్లు విక్టర్, రాణి, సుచరిత, సంధ్య, సునీల్, దేవేందర్, ప్రకాష్, లోమాన్, ఆనంద్ పాల్గొన్నారు.

ఆ స్టంట్ వీడియోలు పాతవే

- వెల్లడించిన డీసీపీ వినీత్

హైదరాబాద్ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్‌లో బైక్ రేసింగ్, క్రాకర్లతో స్టంట్ చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ దర్యాప్తునకు ఆదేశించారు. అయితే పోలీసుల దర్యాప్తులో ఈ వీడియోలు ఏడాది క్రితం తీసినట్లుగా తేలింది. రామంతాపూర్‌కు చెందిన షమీర్ ఏడాది క్రితం ఐటీ కారిడార్ పరిధిలో బైకుకు క్రాకర్స్ పెట్టుకొని స్టంట్‌లు చేసిన వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. ఈ వీడియోలను డౌన్‌లోడ్ చేసుకున్న షాబాజ్ అనే యువకుడు తన ఇన్‌స్టా ఐడీలో పోస్ట్ చేశాడు. దీపావళి సందర్భంగా క్రాకర్స్‌తో ప్రమాదకర స్టంట్‌లు చేశారంటూ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ వీడియోల ఆధారంగా బైక్ స్టంట్‌లు చేసిన షమీర్‌పై కేసు నమోదు చేయడంతో పాటు, బైక్‌ను సీజ్ చేశామని డీసీపీ తెలిపారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోల గురించి విషయం తెలుసుకోకుండా ప్రచారం చేయడం ద్వారా ప్రజలు ఆందోళనకు గురవుతారని, సరైన సమాచారం తెలుసుకున్న తర్వాతే వీడియోలు పోస్ట్ చేయాలని ఆయన సూచించారు. రేసింగ్‌లు నిర్వహించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నామని.. ఈ ఏడాదిలో నవంబర్ 4 వరకు 203 బైకులు, 3 కార్లు సీజ్ చేసినట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ కాజేయబోయిన వ్యక్తి అరెస్ట్

యూసుఫ్‌గూడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒక కాల్ చేసుకోవాలి ఫోన్ ఇవ్వరా అంటూ అడిగి సెల్‌ఫోన్‌తో ఉడాయించాలని ప్రయత్నించిన ఆగంతకుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున 1.50 గంటల సమయంలో ఒక వ్యక్తి అమీర్‌పేట మెట్రోస్టేషన్ వద్ద ఉన్నాడు. అయితే నవీన్, రోహన్ స్కూటీపై వచ్చారు. ఒక కాల్ చేసుకుంటానని అడగడంతో అతడు సెల్‌ఫోన్ ఇచ్చాడు. అయితే ఫోన్ తీసుకుని ద్విచక్ర వాహనంపై పారిపోయేందుకు ప్రయత్నించగా నవీన్‌ను పట్టుకున్నాడు. రోహన్ వాహనంతో పారిపోయాడు. 100కు డయల్ చేయగా మధురానగర్ పోలీసులు వచ్చి నవీన్‌ను తీసుకెళ్లారు.

హాష్ ఆయిల్ అమ్ముతున్న ముగ్గురి అరెస్ట్

యూసుఫ్‌గూడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): హాష్ ఆయిల్ అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులను మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్ఆర్‌నగర్ మెట్రోస్టేషన్ సమీపంలో కొందరు హాష్ ఆయిల్ అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులకు నిఘా పెట్టారు. ఆదివారం మధ్యాహ్నం కె.అతుల్‌సింగ్, సచిన్‌గౌడ్, ఎం.సాయిరామ్ అనుమానితులుగా కనిపించటంతో పోలీసులు వారిని తనిఖీ చేశారు. వారివద్ద హాష్ ఆయిల్ బాటిల్స్ ఉండటంతో అదుపులోకి తీసుకున్నారు. వీరు 6.7గ్రాముల చిన్న బాటిల్స్‌ను రూ.2వేల రూపాయలకు అమ్ముతున్నట్లు తెలిసింది. వారిని అరెస్ట్ చేసిన పోలీసులు 20 హాష్ ఆయిల్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

అంధ క్రీడాకారులకు సహాయం అందిస్తాం

- డీజీపీ డాక్టర్ జితేందర్


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న డీజీపీ డాక్టర్ జితేందర్

హైదరాబాద్ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పోలీసు విభాగం తరఫున అంధ క్రీడాకారులకు ఎల్లప్పుడూ సహాయం అందిస్తామని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. తెలంగాణ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ బ్లైండ్, తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో "ఇన్‌క్రెడిబుల్ ఇండియా తెలంగాణ బ్లైండ్ చాలెంజ్ కప్ 2024 టోర్నమెంట్"ను అంబర్‌పేట వాటర్ వర్క్స్ స్టేడియంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంధుల క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు ప్రత్యేక స్పోర్ట్ ఏర్పాటు ఆవశ్యకతను తెలిపారు. ఈ టోర్నమెంట్ ద్వారా అంధుల క్రీడా ప్రతిభకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని, సమాజంలో అవగాహన పెరుగుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (టీడీసీఏ) ఫౌండర్ ప్రెసిడెంట్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ అల్లీపురం వేంకటేశ్వర్‌రెడ్డి, ఇన్‌క్రెడిబుల్ ఇండియా ప్రాజెక్ట్ సీఈఓ, ఎండీ ప్రవీణ్‌కుమార్ నెడుంగడి, డైరెక్టర్ సరిడేన రాహుల్ రావు, అంధత్వ శాఖ డైరెక్టర్, కమిషనర్ బి.శైలజ, డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ బ్లైండ్(డీఏబీ) తెలంగాణ ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, సీనియర్ క్రికెట్ క్రీడాకారులు సురేందర్ రెడ్డి, హెలెన్ కెల్లర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ రీహాబిలిటేషన్ డిసేబుల్డ్ చిల్డ్రన్ చైర్మన్ ఉమర్ ఖాన్, ఖమ్మం టీడీఎస్‌ఏ సభ్యులు మతీన్, శాట్స్ క్రికెట్ కోచ్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో నిరసనలు


నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నేతలు, ఉద్యోగులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మూడో మెగా యూనివర్సిటీ డా.బి.ఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అని అంబేడ్కర్ జేఏసీ చైర్‌పర్సన్ ప్రొ.పల్లవీకాబ్డే, కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్ అన్నారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పది ఎకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి(జేఎన్ఏఎఫ్ఏయూ) కేటాయించొద్దని సోమవారం ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం తన ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలని.. లేదంటే తమ ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కంప్యూటర్ ఇంజనీర్ వసంతరావు మాట్లాడుతూ.. అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో డిగ్రీ నుంచి పరిశోధన కోర్సుల వరకు విద్యను అందిస్తున్నామన్నారు. దేశంలో స్థూల నమోదు నిష్పత్తిని పెంచడానికి ఈ విశ్వవిద్యాలయ దూర విద్యా విధానాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు, అధ్యాపక, అధ్యాపకేతర, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ అసోసియేషన్, టైంస్కేల్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మహాకాళి ఆలయంలో కార్తీక పూజలు

సికింద్రాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో కార్తీక మాసం తొలి సోమవారం ఘనంగా పూజలు జరిగాయి. సికింద్రాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాత్రి దీపాలు వెలిగించి, అమ్మవారికి పూజలు జరిపారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం దేదీప్యమానంగా విరాజిల్లింది.



ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన



మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేస్తున్న లబ్ధిదారులు

కల్యాణలక్ష్మి షాదీముబారక్ దరఖాస్తుల వెరిఫికేషన్

అడ్డగుట్ట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న షాదీముబారక్, కల్యాణలక్ష్మి దరఖాస్తులను పరిశీలిస్తున్నామని మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్య గౌడ్ తెలిపారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు, కంటోన్మెంట్ ఎమ్మెల్యే నియోజకవర్గంకు సంబంధించి 139 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు సిద్ధంగా ఉన్నాయని, త్వరలో ఎమ్మెల్యేల ద్వారా పంపిణీ జరుగుతుందన్నారు. అయితే లబ్ధిదారులకు ముందస్తు సమాచారం ఇచ్చామని సమయం జాప్యం జరుగకుండా దరఖాస్తులను పరిశీలిస్తున్నామన్నారు. పేపర్ వర్క్ పూర్తి చేసి సిద్ధంగా ఉంచేందుకు వెరిఫికేషన్ చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన లాలాగూడ రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగుట్టకు చెందిన ఏ.వెంకటేష్ (45) పెయింటింగ్ పని చేస్తుంటాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై ఏ పనీ చేయకపోవడంతో భార్య తన ఇద్దరు పిల్లలతో పుట్టింటికి వెళ్లిపోయింది. ఆదివారం రాత్రి 9 గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లిన వెంకటేష్ రాత్రి 10.30 సమయంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసు లు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ బాధితురాలికి అప్పగింత



ప్రయాణికురాలికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైల్వే స్టేషన్‌లో ప్రయాణికురాలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బేగంపేట్ ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ కవిత తిరిగి ఆమెకు అప్పగించారు. నాంపల్లి ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట్ రైల్వే స్టేషన్‌లో సోమవారం ప్రయాణికురాలు నాగమణి సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోవడంతో వెంటనే ఆమె మహిళా కానిస్టేబుల్ కవితకు ఫిర్యాదు చేశారు. అప్పటికప్పుడు ఆర్పీఎఫ్ బృందం రైల్వే స్టేషన్‌లో గాలించగా ప్లాట్‌ఫాం పక్కన పడిఉండగా స్వాధీనం చేసుకుని బాధితురాలికి అప్పగించారు. ఏదైనా ఫిర్యాదు చేయాలనుకుంటే వెంటనే 139 నెంబరుకు కాలే చేస్తే సమస్య పరిష్కరిస్తామని సీఐ తెలిపారు.

మాజీ రిటైర్డ్ రైల్వే ఉద్యోగి అదృశ్యం



ఇస్సాక్ దేవానందం

బౌద్ధనగర్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): మాజీ రిటైర్డ్ రైల్వే ఉద్యోగి అదృశ్యమైన సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం, రామ్‌నగర్ వైఎస్సార్ ప్రాంతానికి చెందిన ఆకెపోగు ఇస్సాక్ దేవానందం (84) మాజీ విశ్రాంత రైల్వే ఉద్యోగి. ఈనెల 1న ఇస్సాక్ దేవానందం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుమారుడు దేవానందం తండ్రి కనిపించడంలేదని అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తుకారాంగేట్‌లో వృద్ధురాలు..



ఆశాబాయి

అడ్డగుట్ట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. తుకారాంగేట్ మరాఠ బస్తీకి చెందిన ఎల్. ఆశాబాయి (65) గత నెల 15న ఇంటినుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. అదే రోజు తుకారాంగేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు కింద నమోదు చేశారు. ఈ వృద్ధురాలి ఆచూకీ తెలిస్తే వెంటనే తుకారాంగేట్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.

శిథిలమైన ఇళ్లల్లో పాడు పని!

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పాటిగడ్డ ప్రభుత్వ క్వార్టర్స్
- నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరిన వందలాది ఇళ్లు
- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తంచేస్తున్న స్థానికులు



శిథిలావస్థకు చేరిన పాటిగడ్డ క్వార్టర్స్

బేగంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బేగంపేట పాటిగడ్డ ప్రభుత్వ క్వార్టర్స్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. భవనాలు శిథిలావస్థకు చేరడంతో మందుబాబులు, పేకాట రాయుళ్లు, గంజాయి బ్యాచ్ ఇక్కడ తిష్టవేస్తున్నారు. వ్యభిచార కార్యకలాపాలు సైతం నిర్వహిస్తున్నారు. ప్రశ్నిస్తే వారిపై దౌర్జన్యాలకు దిగుతున్నారు. రాత్రి సమయంలో అటువైపు వెళ్లే పరిస్థితి లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో..

రాష్ట్ర ప్రభుత్వంలోని పలు విభాగాల్లో పని చేసే ఉద్యోగుల కోసం ఉమ్మడి రాష్ట్రంలో పాటిగడ్డలో ప్రభుత్వ క్వార్టర్స్‌ను నిర్మించారు. సుమారు 500కు పైగా ఇళ్లను నిర్మించారు. అయితే కాలక్రమేణా వీటి నిర్వహణపై అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో ఇక్కడ నివసించే ఉద్యోగులు ఖాళీ చేసి వెళ్లిపోయారు. ప్రస్తుతం మూడో వంతు ఇళ్లు ఖాళీగా ఉన్నాయి. ఇవి శిథిలావస్థకు చేరుకోగా.. ఉద్యోగులు నివసిస్తున్న కొన్ని ఇళ్లకు సైతం పగుళ్లు వచ్చాయి. ఖాళీగా ఉన్న ఇళ్ల మధ్యలో చెట్లు పెరగడంతో ఆకతాయిలకు ఆవాసంగా మారింది. రాత్రి వేళల్లో కార్లలో వచ్చి ఇక్కడ మద్యం తాగుతుంటారని, గతంలో ఇక్కడ పలు హత్యలు సైతం జరిగాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రి 9 నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు సాగుతుంటాయని, నిత్యం గంజాయి బ్యాచ్ తిష్టవేసి ఉంటారని పలువురు పేర్కొంటున్నారు. పాడుబడిన ఇళ్లలోని ఐరన్ గ్రిల్స్, కిటికీలు, తలుపులు దొంగలు తీసుకెళ్లారు. చెట్లు ఏపుగా పెరగడంతో రోడ్డు సైతం మూసుకుపోయింది. వీటి నిర్వహణకు అధికారులు ప్రతి ఏడాది బడ్జెట్ కేటాయిస్తున్నా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎలాంటి ఫలితం ఉండటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో నివసించే ఈ ప్రాంతంలో పోలీస్ పెట్రోలింగ్ లేకపోవడంతో పలుమార్లు మహిళల నగలను దొంగలు కాజేశారు. రాత్రి వేళల్లో పోలీసులు ఇటువైపు రావాలని, ఉన్నతాధికారులు దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరతున్నారు.

చట్ట వ్యతిరేక శక్తులపై నిఘా

పాటిగడ్డ క్వార్టర్స్‌లో పాడుబడిన ఇళ్ల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాం. మద్యం, గంజాయి తాగుతూ పట్టుబడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నాం. పాడుబడిన ఇళ్లల్లో అసాంఘిక కార్యకలాపాలు చేపట్టే వారి వివరాలను 100 నంబర్‌కు కాల్ చేసి చెప్పాలి. ఈ ప్రాంతంపై పలు ఫిర్యాదులు రావడంతో పోలీసు పహారా పెంచాం.

- రామయ్య, ఇన్‌స్పెక్టర్, బేగంపేట

పాఠశాల, కాలేజీ భవనాలకు రూ.30 కోట్లు కేటాయించాలి

- గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ డిమాండ్

బౌద్ధనగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండిలో నిర్మించ తలపెట్టిన ప్రభుత్వ పాఠశాల, జూనియర్, డిగ్రీకాలేజీ భవనాల నిర్మాణానికి వెంటనే రూ.30 కోట్ల నిధులు కేటాయించాలని లష్కర్‌జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీతాఫల్‌మండిలో నిలిచిపోయిన ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ స్థలాన్ని ఆయన లష్కర్‌జిల్లా సాధన సమితి కమిటీసభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ దాదాపు 1500 మంది విద్యార్థులు కలిగిన పాఠశాల పురాతన భవనాలను తొలగించి ఒకే నూతన భవనంలో ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీకాలేజీలను నిర్మించాలని 2022 జూలైలో అప్పటి ప్రభుత్వం రూ.29.75 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. గత సెప్టెంబర్ 23న అప్పటి విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జీవోకు అనుగుణంగా బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ విడుదల చేశారన్నారు. అయితే నిధులు లేకపోవటంతో ప్రారంభించిన పనులు పిల్లర్ల స్థాయికి వచ్చి ఆగిపోయాయన్నారు. ఈ భవనంలో చదువుతున్న పిల్లలను వేరే స్కూల్స్‌కు, కాలేజీలకు తరలించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే నిధులను మంజూరు చేయాలని కోరారు. త్వరలో సీఎంను కలిసి వినతిపత్రం సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి సాదం బాలరాజ్‌యాదవ్, సభ్యులు జగదీష్‌గౌడ్, సునీల్‌ముదిరాజ్, శైలేందర్, రవీందర్‌సాగర్, కృష్ణముదిరాజ్, అజీజ్, తదితరులు పాల్గొన్నారు.



సీతాఫల్‌మండిలో ప్రభుత్వపాఠశాల, జూనియర్, డిగ్రీకాలేజీ స్థలాన్ని పరిశీలిస్తున్న లష్కర్‌జిల్లా సాధన సమితి అధ్యక్షుడు పవన్‌కుమార్

గాంధీ అంటే గౌరవమే.. తప్పయింది క్షమించండి

- క్షమాపణ కోరిన ఆకతాయిలు

బోయిన్‌పల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'గాంధీ అంటే తమకు గౌరవం ఉంది. తెలియక చేశాం.. తప్పయింది క్షమించండి' అని బాపూజీనగర్‌లోని గాంధీ విగ్రహం నోట్లో బాంబుపెట్టి పేల్చిన ఆకతాయిలు సోమవారం అదే విగ్రహం వద్ద వారి తల్లితండ్రులు స్థానికుల సమక్షంలో క్షమాపణ కోరారు. ఈ విషయంపై బోయిన్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లో నివాసం ఉండే ఓ యువకుడు (17)తో పాటు అతని స్నేహితులు మరో ముగ్గురు (16)లు శనివారం తమ బంధువులకు సంబంధించిన పెద్ద కర్మ కార్యక్రమంలో మద్యం, సోషల్ మీడియా పైత్యంలో వారు నివాసం ఉంటున్న బస్తీలోని గాంధీ విగ్రహం వద్దకు చేరారు. ఈ క్రమంలో వారు దీపావళి కావడంతో బాంబులు తీసుకువచ్చి గాంధీజీ నోట్లో బాంబు పెట్టి పేల్చి వీరంగం సృష్టించారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అయింది. దీంతో ఈ వీడియోను స్నాప్ చార్ట్‌లో చూసిన స్థానికులు విషయాన్ని పోలీసులకు తెలిపారు. విచారణ చేపట్టిన బోయిన్‌పల్లి పోలీసులు నలుగురు ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో తల్లితండ్రుల విజ్ఞప్తి మేరకు సోమవారం అదే విగ్రహం వద్ద ఆకతాయిలు గాంధీజీ వి గ్రహానికి పాలాభిషేకం చేసి శుద్ధిచేశారు. అనంతరం పూలమాలలువేసి నివాళులర్పించి చెంపలు వేసుకుని పోలీసులను, స్థానికులను తల్లితండ్రుల సమక్షంలో ప్రాధేయపడ్డారు. దీంతో ఈ ఘటనపై పోలీసులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం వారిని కోర్టులో హాజరుపరచనున్నారు.



గాంధీజీ విగ్రహానికి పూలమాలలువేసి వేడుకుంటున్న ఆకతాయిలు

కుల గణన బీసీలకే పరిమితం కావద్దు

- యాదవ విద్యా వంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ యాదవ్

అడ్డగుట్ట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం కుల జనగణనను బీసీలకే పరిమితం చేయకుండా అన్ని కులాల సమగ్ర సమగ్ర కుల జనగణనలాగా నిర్వహించాలని యాదవ విద్యా వంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తుకారాంగేట్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 6 నుంచి జరుగుతున్న కులగణనలో ఓసీలకు సంబం ధించిన ఆర్థిక సర్వే లేకుండా అది సంపూర్ణ సర్వే కాదని దీనిపై జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రాష్ట్ర కులగణన చైర్మన్, కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ దూదిమెట్ల శ్రీనివాస్ యాదవ్, అచ్యుత యాదవ్‌లు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ ఆఫీస్‌కు సూచిక బోర్డులు లేవు

'ప్రజావాణి'లో నాయకుడి ఫిర్యాదు

అడ్డగుట్ట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయానికి సూచిక బోర్డులు లేకపోవడంతో దరఖాస్తు దారులు ఏ అంతస్థులో ఏ విభాగం ఉంటుందో తెలియక తికమక పడుతున్నారని వెంటనే కార్యాలయానికి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తుకారాంగేట్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు వి.నర్సింగ్‌రావు సోమవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. ఈ కార్యాలయంలో మొత్తం ఐదు అంతస్థులు ఉన్నాయని ఏ అంతస్థులో ఏ విభాగాలు ఉంటాయో తెలియదన్నాడు. అందుకు జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి, సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.



సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసి కార్యాలయం



క్రీడా జ్యోతిని వెలిగించి స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి

క్రీడలు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయి

- డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి

తార్నాక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, విద్యార్థుల నాయకత్వ లక్షణాలను పెంపొందింపజేస్తాయని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి అన్నారు. సోమవారం లాలాపేట్‌లోని ప్రొ. జయశంకర్ స్టేడియంలో తార్నాక నారాయణ పాఠశాల యాజమాన్యం స్పోర్ట్స్ మీట్ 2024 ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ ముఖ్య అతిథిగా హాజరై స్పోర్ట్స్‌మీట్‌ను ప్రారంభించారు. అనంతరం క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్‌తో పాటు, సర్టిఫికెట్లు, ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే క్రీడలను అలవర్చుకున్నట్లయితే శారీరక ధృడత్వంతో పాటు, భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యా సంస్థల డీజీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం బాల పరమేశ్వర్, పిన్సిపాల్ పర్వీన్, హెచ్‌ఆర్ లక్ష్మి, మోగేందర్, ఆజాద్, లక్ష్మీ భవాని, నరేష్ పాల్గొన్నారు.



హిందూ ధర్మ పరిరక్షణ కోసం సికింద్రాబాద్ ముత్యాలమ్మ దేవాలయ విగ్రహ ధ్వంసంపై శాంతి యుతంగా ధర్నా చేసి అరెస్టయి విడుదలయిన మెట్టుగూడకి చెందిన పార్టీ జాయింట్ కన్వీనర్ రాజేష్‌ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సోమవారం అభినందనలు తెలిపి శాలువతో సత్కరించారు - (చిలకలగూడ, ఆంధ్రజ్యోతి)



ఆలయ కమిటీ సభ్యులతో నూతన చైర్మన్ కూన శ్రవణ్ కుమార్ గౌడ్

సాయి గణపతి ఆలయ చైర్మన్‌గా శ్రవణ్‌కుమార్

బేగంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బేగంపేట రైల్వే స్టేషన్ సమీపంలోని ప్లైఓవర్ కింద ఉన్న శ్రీ సాయి గణపతి ఆలయ నూతన చైర్మన్‌గా కూన శ్రవణ్‌కుమార్ గౌడ్ ఎన్నికయ్యారు. ఇటీవల ఆలయ చైర్మన్ కూన వెంకటేష్‌గౌడ్ అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆలయ కమిటీ ప్రతినిధులు పలు మార్లు సమావేశమై నూతన చైర్మన్‌ను ఎన్నుకోవాలని తీర్మానం చేశారు. అందులో భాగంగా ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షులు అంజిబాబు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నరహరిగౌడ్, కోశాధికారి నాయుడు నేతృత్వంలో కమిటీ ప్రతినిధులు ఆలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా శ్రవణ్‌కుమార్‌గౌడ్‌కు ఆలయ కమిటీ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. సమావేశంలో కమిటీ ప్రతినిధులు శంకర్‌యాదవ్, విజయకుమార్ ముదిరాజ్, దశరద్, రామచందర్, చంద్రకళ, విజయలక్ష్మి, కొమరమ్మ పాల్గొన్నారు.